మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట



## అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా చేపట్టిన మరమ్మతు పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

### వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్



పాఠశాల పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి మే 29 ప్రభాతవార్త :** పాఠశాలలు పున:ప్రారంభం అయ్యేనాటికి పాఠశాలల్లో మౌలిక వసతులు సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. బుధవారం పాన్‌గల్ మండల పరిధిలోని దావాజీ పల్లి, దొండాయి పల్లి, రాయిని పల్లి గ్రామాల్లో సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా చేపట్టిన మరమ్మతు పనులు, మౌలిక సదుపాయాలు వేగవంతంగా పూర్తి చేయడమే కాకుండ నాణ్యతతో కూడిన పనులు జరగాలని ఆదేశించారు. తాగునీటి వసతి, వంట గది, మరుగుదొడ్లు సహా చిన్న చిన్న మరమ్మతు పనులు పూర్తి చేయాలని సూచించారు. దావాజీ పల్లి గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ రికార్డులను పరిశీలించారు. గుడ్లు, పాలు తదితర సామాగ్రి నిల్వలను పరిశీలించారు. జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మిబాయి, ఎంపీడిఓ కోటేశ్వర్, ఎంపీఓ రఘురామ్, ఎంఈఓ లక్ష్మణ్ నాయక్, పంచాయతి కార్యదర్శి శ్రీకాంత్ , ఏపిఓ కురుమయ్య, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి..

- డిగ్రీ కళాశాల స్థలం కోర్టులో ఉండగా అద్దె వసూలు
- షెడ్డు నిర్మాణాలకు అనుమతలు ఎక్కడివి ..
- బీజేపీ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు నాగూరావు నామాజీ




మాట్లాడుతున్న నాగూరావు నామాజీ

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 29,ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ భూములు, ఆస్తులు కబ్జాలకు గురి అవుతున్నాయని, వాటి పరిరక్షించాలని బీజేపీ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు నాగూరావు నామాజీ డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కబ్జాలకు పాటుపడ్డ వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. పట్టణంలోని సింగిల్ విండో స్థలంలో అక్రమ నిర్మాణానికి సహకరించిన అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ మార్కెట్ స్థలంలో నిర్మించిన దుకాణాలను కోర్టులో ఉండగానే ఇష్టానుసారంగా వ్యాపారులు కబ్జా చేసి వ్యాపారాలు చేసుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఆరు ఎకరాల స్థలంపై కోర్టులో కేసు ఉండగా యథేచ్ఛగా ఆ స్థలంలో షెడ్డు నిర్మించి అద్దెలు వసూలు చేస్తున్నారని వారికి ఎవరు అనుమతి ఇచ్చారని, అద్దెలు ఎవరికి చెల్లిస్తున్నారని ప్రశ్నించారు. చెరువును ట్యాంక్‌బండ్ పేరుతో కుంటగా మార్చారని కాలువలనే సైతం కబ్జా చేశారని ఆరోపించారు.

## రైతు సంక్షేమానికి కట్టుబడి పనిచేయాలి...

- ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి



సింగిల్ విండో చైర్మన్ రాంచంద్రారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,మే 29 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సంక్షేమానికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగడం జరుగుతుందని, ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా సింగిల్‌విండోలు రైతు సంక్షేమానికి అనుగుణంగా పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని తాడూర్ సింగిల్ విండో చైర్మన్‌గా రాంచంద్రారెడ్డిని నియామక కార్యక్రమానికి ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదం రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు రైతుల సంక్షేమాన్ని విస్మరిస్తే ఇటీవల రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు రైతు సంక్షేమానికి అనేక నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రైతుల పక్షపాతిగా నూతన చైర్మన్ పనిచేసి రైతుల ప్రయోజనాలను కాపాడాలని ఎమ్మెల్యే కోరారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్ రాంచంద్రారెడ్డిని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రోహిణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ రేణుక, ముఖ్య నాయకులు భగవంతురెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్లు తదితరులు ఉన్నారు.

## కొనసాగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- పర్యవేక్షించిన డీఐఈవో శ్రీధర్ సుమన్

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 29,ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా నాలుగో రోజు ఇంటర్మీడియెట్ ప్రథమ,ద్వితీయ సంవత్సరం సప్లింమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శ్రీధర్ సుమన్ తెలిపారు. జిల్లాలో బుధవారం ప్రథమ,ద్వితీయ సంవత్సరం గణితం, జువాలజీ, హిస్టరీ సబ్జెలకుగానూ పరీక్ష నిర్వహించారు. జిల్లాలోని 21 పరీక్షా కేంద్రాల్లో మొదటి సంవత్సరం మొత్తం 4393 మంది విద్యార్థులకుగానూ 4213మంది విద్యార్థులు హాజరయ్యారు. 178మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. హాజరైనవారిలో 3960జనరల్, 253 ఒకేషనల్ విద్యార్థులున్నారు. రెండో సంవత్సరం మొత్తం 1409 మంది విద్యార్థులకుగానూ 1312 మంది విద్యార్థులు హాజరుకాగా, 81మంది గైర్హాజరైనట్లు ఆయన వెల్లడించారు. హాజరైన వారిలో జనరల్ 1159 జనరల్, 169ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారు. రెండోరోజు డీఈసీ బృందం జడ్చర్ల, కోయిలకొండ, మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ,ప్రైవేట్ కళాశాల కేంద్రాలను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంచాలని సూచనలు చేశారు. ఇంటర్ బోర్డు నియమం నిబంధనల మేరకు పరీక్షలనే ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు, మధ్యాహ్ననం 2.30గంటల నుంచి 5.30వరకు నిర్వహించినట్లు తెలిపారు. తొలిరోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు కోసం ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలుకు చేరుకునేలా తగు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసిఉంచేలా చర్యలు చేపట్టారు. ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ కోసం చీఫ్ సూపరిండెంట్లు,. అడిషనల్ సీఎస్ డిపార్ట్ మెంటల్ అధికారులు, అధికారులు, కస్టోడియన్లు ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలతో పాటు డీఈసీ సభ్యులు ఉమామహేశ్వర్, రవీందర్ తదితర అధికారులు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అవతరణ వేడుకలు అదరాలె..

- సీఎం నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష
- హాజరైన మంత్రి జూపల్లి, ఎమ్మెల్యేం యెన్నం



సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షలో పాల్గొన్న మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే యెన్నం

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 29,ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు సంబంధించిన పలు అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్షకు పాలమూరు నేతలు హాజరయ్యారు. బుధవారం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశానికి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఇందులో భాగంగా తెలంగాణ తల్లి, తెలంగాణ గీతం, రాష్ట్ర చిహ్నం తుదిరూపుపై చర్చించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజు ఆవిష్కరించేందుకు అవసరమయ్యే అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం నాడు చేసిన పోరాటం త్యాగాలు ప్రతిబింబించే విధంగా చిహ్నం రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ప్రభుత్వం ప్రధాన సలహాదారుడు వేం నరేంద్ రెడ్డి, తెలంగాణ గీత రచయిత అందెశ్రీ పాల్గొన్నారు.

## విత్తనాల సీజన్..!!

- రైతన్నలకు నకిలీల బెడద..
- తొలకరొచ్చిందటే విత్తన వ్యాపారులకు పండగే..
- అదును చూసి పదును పెడుతున్న వ్యాపారులు..
- పత్తి,వరి విత్తనాలకు క్యూలు కడుతున్న రైతులు..



**భూత్పూర్,మే 29,ప్రభాతవార్త :** తొలకరి వానలు కురిసాయంటే రైతన్నల గుండెల్లో గుబులు మొదలౌతుంది. వేలకు వేల రూపాయలు అప్పులు తెచ్చి విత్తనాలు కొనుగోలు చేసి పుడమి తల్లిని నమ్ముకుని భూమిలో పోస్తే అవి అస్లీవైతే మొలకెత్తుతాయి. నకిలీవైతే రైతన్నను నట్టేటా ముంచుతాయి. ప్రతీ.కష్టాన్ని, భూమిని నమ్మి చదును చేసుకుని రోజుల తరబడి విత్తన విక్రయదారుల దుకాణాల వద్ద క్యూలు కట్టి చివరకు విత్తనాలు తెచ్చుకుని నాటితే అవి ముంచుతాయో.. తేల్పుతాయోనన్న అయోమయ స్థితిలో రైతన్నలు విత్తనాల్ని కొనుగోలు చేస్తుంటారు. ఏటా మే,జూన్‌లలో విత్తన సీజన్ మొదలౌతుంది. ముఖ్యంగా మే మూడో వారం నుంచి పత్తి విత్తన కొనుగోలు మొదలౌతుంది. దీని కోసం రైతన్నలు పను లు మానుకుని విత్తనాల కోసం దుకాణాల వద్ద క్యూలు కట్టి విత్తనాల కోసం ఎగబడుతుంటారు. ఇదే అదునుగా భావిం చిన కొందరు విత్తన వ్యాపారులు ఈ బ్రాండు బాగున్నాయి..ఆ బ్రాండు బాగున్నాయంటే రకరకాల జిమ్మిక్కులు చేస్తూ రైతులను ఆకర్శిస్తూ వారిని మభ్యపెడుతూ రైతుల అమాయకతను ఆసరాగా చేసుకుని వారికి నాణ్యతలేని విత్తనాలను అంటగడుతుంటారు కొందరు విత్తన వ్యాపారులు. ఎంతో శ్రమకోడ్చి విత్తనాలు తెచ్చుకుని భూమిలో నాటుకుంటారు రైతన్నలు..తీరా అవి వారం రోజులైనా మొలకెత్తకుంటే దిగాలుతో గుండెలు బాధుకుంటూ చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు కొందరు రైతులు. ప్రతీ ఏటా పత్తి విత్తన కొనుగోలు మే,జూన్‌మాసా ల్లో అధికంగా సాగుతుంటుంది. భూత్పూర్ మండలంలో ఐదారుకు మించిన విత్తన వ్యాపార కేంద్రాలు, ప్రాసెసింగ్ యూనిట్లున్నాయి. ఈ సీజన్ వచ్చిందంటే చాలు పత్తి విత్తనవ్యాపారుల కు పండగే పండగ. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు ప్రభు త్వమెన్ని చర్యలు చేపడుతున్నప్పటికి అక్కడక్కడా మోసాలు జరుగుతునే ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అధికారుల నామమాత్రపు పర్యవేక్షణ, విత్తన విక్రయాలపై నియంత్రణ లేకపోవడంతో ఈ వ్యాపారుల ఆగడాలకు అడ్డుకట్టే లేకుండా పోతోందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తితో పాటు వరి విత్తనాలను కొనుగోలు చేస్తున్న రైతులు ఐఎస్ఐ ముద్ర ఉందా..? లేదా అన్న అంశాన్ని స్పష్టంగా గమనించి కొనుగోలు చేయాల్సిన అవసర మెంతైనా ఉందని పలువురు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా విత్తన నియంత్రణ అధికారులు, వ్యవసాయశాఖ అధికారు లు పత్తి,వరి విత్తన సీజన్లో తగు నిఘాతో పాటు గట్టి నియంత్రణ చేయాల్సి ఉంటుందనే అభిప్రాయం లేకపోలేదు. ఆ దిశగా సంబంధిత వ్యవసాయశాఖ, పోలీస్‌శాఖలు అడుగేసి అమాయకులైన రైతులకు నకిలీ విత్తనాల బెడదను తొలగించాలని కోరుతున్నారు. విత్తనాలతో డీఏపీ ఎరువులకు కూడా ఈ సీజన్‌లో రెక్కలొస్తాయి. ఎమ్మార్పీ కంటే అదనపు ధరలకు విక్రయిస్తూ అమాయకులైన రైతుల నడ్డీ విరుస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో పత్తి,వరి విత్తనాల దుకాణాలతో పాటు,ఎరువుల దుకాణాలపై సంబంధిత అధికారులు గట్టి నిఘా ఉంచి అధిక ధరలను నియంత్రించి తమను ఆదుకోవాలని పలువురు రైతులు అధికారులను కోరుతున్నారు.

## ఉప ఎన్నిక కౌంటింగ్ పారదర్శకంగా నిర్వహించాలి..

### మహబూబ్‌నగర్ జిల్లా రిటర్నింగ్ అధికారి జి.రవి నాయక్

### కౌంటింగ్ ఏర్పాట్ల పై అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న జిల్లా రిటర్నింగ్ అధికారి జి.రవి నాయక్



హాజరైన అధికారులు

**మహబూబ్‌నగర్ బ్యూరో మే 29 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి ఉప ఎన్నిక కౌంటింగ్ ఎన్నికల నిబంధనల ననుసరించి నిష్పక్షపాతంగా సజావుగా, పారదర్శకంగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ జి.రవి నాయక్ అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహబూబ్‌నగర్ స్థానిక సంస్థ నియోజకవర్గ శాసనమండలి ఉప ఎన్నిక కౌంటింగ్ ప్రక్రియ పై కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లకు ఓట్ల లెక్కింపు ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణా కార్యక్రమం నిర్వహించి అవగాహన కలిగించారు. రిటర్నింగ్ అధికారి, మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ జి.రవి నాయక్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపులో సిబ్బంది షెడ్యూలు సమయం కంటే ముందే రావాలని, సమయానికి రిపోర్ట్ చేయాలని సెల్ ఫోన్లను తీసుకురావద్దని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాధాన్యత క్రమం ప్రకారం ఓటర్లు ఓటు లెక్కింపు చేపడతామన్నారు. కౌంటింగ్ కోసం ఐదు టేబుల్ లను ఏర్పాటు చేశామన్నారు. ప్రారంభం లెక్కింపులో మొత్తం 10 పోలింగ్ కేంద్రాల్లో నమోదైన ఓట్లను లెక్కిస్తారని అన్నారు. కౌంటింగ్ కోసం ఐదు టేబుల్ లను ఏర్పాటు చేశామన్నారు. ప్రారంభ లెక్కింపు అనంతరం మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు జరుగుతుందని, మొదటి ప్రాధాన్యత ప్రకారం ప్రతి అభ్యర్థి సాధించిన ఓట్లను లెక్కిస్తామని అన్నారు . మొదటి ప్రాధాన్యత ఓట్లు లెక్కింపు అనంతరం చెల్లుబాటు అయిన ఓట్ల సంఖ్య ఆధారంగా గెలుపు కోసం కావలసిన కోటాను నిర్ధారిస్తామని అన్నారు .ఎవరైనా అభ్యర్థి కోటాకు సరిపడు ఓట్లను సాధించినట్లయితే అతనిని గెలుపొందినట్లుగా ప్రకటిస్తామని ,ఏ అభ్యర్థికీ కోటాకు కావలసిన ఓట్లు రానట్లయితే తదుపరి ఎలిమినేషన్ ప్రక్రియను చేపట్టి తదుపరి ప్రాధాన్యత క్రమం ఆధారంగా ఓట్ల లెక్కింపు జరుపుతామని అన్నారు. ఈ ప్రక్రియ ఏదేని అభ్యర్థి కోటాను సాధించేవరకు చేపడతామన్నారు. ఏ అభ్యర్థికి కోటా రానట్లయితే చివరికి మిగిలిన అభ్యర్థి గెలుపొందినట్లుగా ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్ రావు, నారాయణపేట అదనపు కలెక్టర్ మాయాంక్ మిట్టల్ షాద్‌నగర్ ఆర్‌డి వెంకటమాధవ్ రావు, మహబూబ్‌నగర్ ఆర్‌డిఓ నవీన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కౌంటింగ్‌లో ఇబ్బందులు రానీయొద్దు

- ఏర్పాట్లు పరిశీలించిన నారాయణపేట కలెక్టర్ కోయ శ్రీహర్ష



అధికారులకు సూచనలు సలహాలు అందిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 29,ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం సమీపంలోని పాలమూరు యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లను బుధవారం నారాయణపేట కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్లు మయాంక్ మొత్తల్, అశోక్‌కుమార్ పరిశీలించారు. జిల్లాలోని మక్తల్, నారాయణపేట, నియోజకవర్గాలనకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఏర్పాట్లపై పలు సూచనలు, సలహాలు అందించారు. ఈవీఎం మిషన్లు ఏజెంట్లకు స్పష్టంగా కనిపించేలా చూడాలని అన్నారు. ఆయనవెంట జిల్లా అధికారులు ఎనికల అధికారులు పాల్గొన్నారు.

## బడి బాటను విజయవంతం చేయాలి..



డీఈఓ గోవిందరాజులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 29 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం కోసం బడీడు పిల్లలను బడుల్లో చేర్పించాల ని, విద్యార్థుల నమోదును పెంచడం కోసం రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల పరిధిలో జూన్ 3 నుంచి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు బుధవారం తెలిపారు. ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను చేపడుతామని చెప్పారు. జూన్ 12 నుంచి బడులు పున:ప్రారంభమవుతాయని, ఈ సందర్భంగా పండుగ వాతావరణంలో పాఠశాలలను తెరువాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలపై వారికి భరోసా కల్పించాలన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా పంచాయతీ రాజ్, మున్సిపల్, డీఆర్డీఏ, లేబర్, వైద్య, ఆరోగ్య, అన్ని సంక్షేమ శాఖలు, మహిళా సమైక్య సంఘాలతో సమన్వయం చేసుకుంటూ అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులు, స్వయం సహాయక బృందాలతో సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు భారీగా నమోదయ్యేలా ప్రతి ఒక్కరు చర్యలు తీసుకోవాలన్నారు. బడిబాట కార్యక్రమంలో నిర్వహించాల్సిన రోజు వారిగా నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని డీఈఓ గోవిందరాజులు సూచించారు.

## గుర్రాల కోసం అక్రమంగా మట్టి తరలింపు..

- అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలి - ఏడీకి రంగారెడ్డి గూడ గ్రామస్తుల ఫిర్యాదు



మైనింగ్ అధికారులకు వినతి అందజేస్తున్న రంగారెడ్డిగూడ గ్రామస్తులు

**బాలనగర్, మే 29,ప్రభాతవార్త :** తమ గుర్రాల కోసం అక్రమంగా మట్టిని తరలించిన వారిపై చర్య లు తీసుకోవాలని కోరుతూ రంగారెడ్డి గూడ గ్రామ స్తులు మహబూబ్‌నగర్ జిల్లా ఏడీ మైన్స్ అండ్ జియాలజికి బుధవారం ఫిర్యాదు అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. రంగారెడ్డి గ్రామ శివారులోని భూమి సర్వే నెంబర్ 87,89,90,91లో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, అతని సోదరుడు దుష్యంత్‌రెడ్డి గుర్రాలపై స్వారీ చేయడం కోసం అక్రమంగా మైనింగ్ అనుమతి లేకుండా మూడు మీటర్ల మట్టిని నింపారని పేర్కొన్నారు. ఈ మట్టిని రంగారెడ్డి గూడ శివారులోని సర్వే నెంబర్ 361,362 లోనుంచి ఇష్టారీతిగా 4నుంచి5మీటర్ల గుంతలు తీసి వేల ట్రిప్పుల మట్టిని తరలించి వారి సొంత ఇంటి అవసరాలకు ఇంటి వెనకాల డంప్ చేశారని ఆరోపించారు. మైనింగ్ అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి మైనింగ్ చట్టం ప్రకారం పెనాల్టీ విధించి ప్రభుత్వానికి చెల్లించే విధంగా చూడాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. సర్వే నెంబర్ 87,89లో గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా షెడ్లు ఏర్పాటు చేసి నేటి వరకు గ్రామ పంచాయతీకి ట్యాక్స్ కూడా చెల్లించడం లేదని పేర్కొన్నారు. బాలానగర్ గ్రామంలో అక్రమంగా మట్టి నింపారని మైనింగ్ అధికారులు ఫైన్ చేసిన విధంగా ఇక్కడ కూడా విచారణ చేసి చర్య తీసుకోవాలని కోరారు. వినతి అందజేసిన వారిలో ప్రశాంత్‌రెడ్డి, కే శ్రీనివాసులు, ఆర్ శ్రీనివాసులు, కే యాదయ్య తదితరులు ఉన్నారు.

## ఎండలో కూలీల ఇబ్బందులు

- టెంట్ ఏర్పాటు చేయించిన మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌నగౌడ్



టెంట్ ఏర్పాటు చేయించిన శ్రీనివాస్‌గౌడ్



కూలీలతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్‌బ్యూరో,మే29,ప్రభాతవార్త:** హన్వాడ మండల కేంద్రంలోని పోస్టాఫీస్ వద్ద ఉపాధి హామీ కూలీలు ఎండలో నిలబడ్డ విషయాన్ని గుర్తించిన మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ వెళ్లి బుధవారం పలుకరించారు. 5వారాలు పనిచేసినా ఇప్పటివరకు కూలీ ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌ప్రభుత్వం ఉన్న సమయంలో టెంట్లు వేసి కూలీ ఇచ్చేవారని, ఇప్పుడు ఎండలో నిలబెట్టి ఇస్తున్నారని పేర్కొన్నారు. కూలీలు ఎండలో ఇబ్బందిని గమనించి టెంట్ ఏర్పాటు చేయించారు. దీంతో కూలీలు శ్రీనివాస్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## అమ్మ ఆదర్శ పాఠశాలలో పనుల పరిశీలన...

**- జిల్లా అదనపు కలెక్టర్ దీపక్‌కుమార్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 29 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినీ, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ముందస్తుగా మండలంలోని ఆయా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తూ నిర్మాణ పనులను చేపట్టారు. ఆ నిర్మాణ పనులను బుధవారం జిల్లా అదనపు కలెక్టర్, లోకల్ బాడీస్ దీపక్ కుమార్ నాగర్‌కర్నూల్ మండలం తూడుకుర్తి గ్రామంలోని అమ్మ ఆదర్శ పాఠశాల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. జెడ్పీహెచ్ఎస్, సీపీఎస్, పీఎస్‌హెచ్‌సీ, పీఎస్ ఊర్దు మీడియం పాఠశాలకు కావాల్సిన కనీస వసతులను పరిశీలించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ రాజ్ ఇంజనీయర్లతో మాట్లాడారు. మరికొద్ది రోజుల్లో విద్యా అకాడమీ ప్రారంభం కావడంతో పాఠశాలలో మంచినీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, బ్లాక్ బోర్డులు పాఠశాలకు కావాల్సిన కనీస సౌకర్యాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎంపీడీఓ శ్రీనివాసులు, పంచాయతీ రాజ్ ఏఈ సంపత్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, సెక్రటరి రవీందర్ తదితరలు ఉన్నారు.



## ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు..

**ప్రణాళికతో ఇష్టంగా చదివి విజయం సాధించాలి.. జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్..**

**గద్వాల ప్రతినిధి మే 29 ప్రభాతవార్త :** ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ప్రణాళికతో ఇష్టంగా చదివి విజయం సాధించాలని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు అపూర్వ చౌహాన్ అన్నారు. బుధవారం ఐడిఓసి లోని తన ఛాంబర్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ ను అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జోగులాంబ గద్వాల జిల్లాలో ఇప్పటికే బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో 60 మంది అభ్యర్థులకు గ్రూప్ -1 ప్రిలిమ్స్ పరీక్షకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఉచితంగా పంపిణీ చేసిన మెటీరియల్ లోని అంశాలను కూడా క్షుణ్ణంగా చదివి ప్రిలిమ్స్ పరీక్షను అభ్యర్థులు మంచిగా రాయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారిని శ్వేతా ప్రియదర్శిని, స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**కల్వకుర్తిరూరల్, మే 29 ప్రభాతవార్త:**కల్వకుర్తి మండలం జిల్లెల్ల గ్రామంలో ఇటీవల మృతి చెందిన వికలాంగుల సంఘం నేత పెరుమాళ్ల కృష్ణ కుటుంబాన్ని మాజీ సర్పంచ్ జిల్లెల్ల రాములు పరామర్శించారు. మాజీ సర్పంచ్ రాములు వ్యక్తిగతంగా రూ.40వేల ఆర్థిక సహాయం అందించా రు.అదే విధంగా గ్రామ నాయకులు రూ.30వేల ఆర్థిక సహాయాన్ని అందించి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో హనుమాన్ దేవాలయ చైర్మన్ కొమ్మగోని రవిగౌడ్, వైస్ చైర్మన్ వీరెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యులు గుమ్మకొండ బాల్ జంగయ్య, మహేంద్రం, హోంగార్డుల సంఘం అధ్యక్షులు కృష్ణ, నాయకులు మోక్తాల బాల్ జంగయ్య, యాదయ్య, దార పాండు, ప్రభాకర్, డొక్క జంగయ్య, వినయ్, వెంకటయ్య, రాజు, పెద్ద యాదయ్య, సుల్తాన్, రమేష్, పవన్, రాములు, శ్రీశైలం తదితరులు ఉన్నారు.



## నాణ్యమైన విత్తనాల ఎంపికైన రైతులకు అవగాహన

**-జిల్లా వ్యవసాయాధికారి చంద్రశేఖర్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 29 ప్రభాతవార్త:**నాణ్యమైన విత్తనాల ఎంపికపై రైతులకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రశేఖర్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం తాడూర్ మండలం శిర్సవాడ గ్రామంలో వర్షకాలంలో విత్తన కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తల గురించి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో గ్రామంలో కానీ, మండలంలో కానీ, జిల్లాలో కానీ లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలని, పంట దిగుబడి వచ్చే వరకు రసీదులు భద్రపర్చుకోవాలని రైతులకు సూచించారు. విత్తనాల ప్యాకెట్లపై తయారు తేదీ,కాలం, ముగిసిన తేదీతో పాటు బ్యాడ్జీ నెంబరు, లాట్ నెంబరు, ధర లేబుల్ కలిగిన విత్తన ప్యాకెట్లను మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. ఎవరైన లూస్ విత్తనాలు తక్కువ ధరకు విక్రయిస్తే రైతులు వ్యవసాయ శాఖకు లేదా పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సాయి రమేష్, గ్రామ రైతులు తదితరులు ఉన్నారు.




## రాష్ట్రస్థాయి బాలసాహిత్యా సమ్మేళనంలో మోడల్ కళాశాల అధ్యాపకుడు

**కొత్తకోట మే 29 ప్రభాతవార్త :** తెలంగాణ సారస్వత పరిషత్తు రాష్ట్రస్థాయి బాల సాహిత్య సమ్మేళనంను మే 29,30 వ తేదీల్లో అబిడ్స్, హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యం విజ్ఞానం అనే బాలల సైన్సు గ్రాంథాన్ని పద్మభూషణ్ డా.వరప్రసాదరెడ్డి, సారస్వత పరిషత్తు అద్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, రమణచారి, జుర్రు చెన్నయ్య చేతులమీదుగా ఆవిష్కరించబడింది. ఈ గ్రంథంలో నరేష్ కుమార్ రాసిన సైన్సు వ్యాసాలు ప్రచురించబడ్డాయి. అదే విధంగా ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి ఆహ్వానించిన బాలసాహితీ వేత్తలచే బడిలో తెలుగు భాష అనే సదస్సును ఏర్పాట చేశారు. ఈ సదస్సులో నరేష్ కుమార్ వక్తగా పాల్గొని మాట్లాడటం జరిగింది. బడిలో తెలుగు భాష బోధనలో ఎదురవుతున్న ఇబ్బందులు సవాళ్ళు సమస్యలు పరిష్కారాలపై వివరించారు. గ్రంథావిష్కరణలో రచయితగా , సదస్సులో వక్తగా నరేష్ కుమార్ పాల్గొనడం పట్ల వనపర్తి సాహితీ వేత్తలు జనజ్వాల, నారాయణ రెడ్డి, నాయకంటి నరసింహ శర్మ, భైరోజు చంద్రశేఖర్, ఉప్పరి తిరుమలేశ్, సత్తార్, గుడిసె శివలింగం,లు అభినందనలు తెలియజేశారు.



## నారాయణ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 29 ప్రభాతవార్త:** తెల్కపల్లి మండలం చిన్నముద్దునూర్ గ్రామంలో మంగళవారం మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు సోదరులు పర్శపాకుల నారాయణ అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధనరెడ్డి బుధవారం మృతుడు కుటుంబాన్ని పరామర్శించి వ్యక్తిగత సహాయంగా రూ.10వేలు అందించారు. మృతుడి కుటుంబానికి భరోసా కల్పించి ధైర్యంగా ఉండాలని సూచించారు. పార్టీ పరంగా కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉన్నారు.



# వైభవంగా శ్రీ లక్ష్మినరసింహ్మాస్వామి వార్శికోత్సవ వేడుకలు...

**కల్వకుర్తిరూరల్, మే 28 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం కుర్మిద్ద గ్రామంలో శ్రీ లక్ష్మినరసింహస్వామి వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు సుప్రభాతం, అభిషేకాలు, హోమం, భాస్కర్ శర్మ ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చరణల మధ్య లక్ష్మినరసింహస్వామి కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల సహకారంతో వార్షికోత్సవ వేడులకను ఘనంగా నిర్వహించినట్లు దేవాలయ చైర్మన్ కృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు తెలిపారు. దేవాలయ ఫౌండర్ వంగ మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు బొడ్రాయి అమ్మవారికి ఆడపడుచులు మహిళలు పెద్ద ఎత్తున జలాభిషేకాలు నిర్వహించారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

**ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే....**

కుర్మిద్ద గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మినరసింహస్వామి వార్షికోత్సవ వేడుకల్లో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని అలవర్చుకోవాలని, భక్తి మార్గంలో నడువాలన్నారు. భక్తితోనే ముక్తి లభిస్తుందన్నారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్, ఫౌండర్‌లు ఎమ్మెల్యేను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.





బొడ్రాయి అమ్మవారికి జలాభిషేకం నిర్వహిస్తున్న మహిళలు



వేడుకల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని శాలువాలతో సన్మానిస్తున్న చైర్మన్, ఆలయ ఫౌండర్

## 1969 తెలంగాణ ఉద్యమకారులను సన్మానం చేయాలి...

**జెడ్పి చైర్మన్ సరిత తిరుపతయ్యను కలిసిన ఉద్యమ కారులు..**

**గద్వాల ప్రతినిధి మే 29 ప్రభాతవార్త :** 1969 తెలంగాణ ఉద్యమ కారులను జూన్ 2 న తెలంగాణ ఆవిర్భావ దినోగ్సవం సందర్భంగా సన్మానం చేసి గౌరవించాలని ఉద్యమ కారుల సంఘం నాయకులు మోహన్ రావు, అచ్చన్న గౌడ్‌లు బుధవారం జెడ్పి చైర్మన్ సరితను కలిసి వినతిపత్రం అందజేశారు. వారి గౌరవార్థం జూన్ 2 హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్లో జరిగే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియా గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ సంబరాలు పరేడ్ గ్రౌండ్లో జరుపుటకు విచ్చేయుచున్నారు. అట్టి సభలో గద్వాల నియోజకవర్గంలో 1969 ఉద్యమంలో అసువులు బాసిన పోలీస్ తూటాలకు బలైనటువంటి సాశం సర్వారెడ్డి, కొట్టం వేణుగోపాల్ బలై ప్రాణాలు కోల్పోయారు. ఇట్టి విషయాన్ని సరిత తిరుపతయ్యతో తెలియజేయగా ఆమె ఇట్టి విషయాన్ని నేను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్తాను అని హామీ ఇచ్చారు. అట్టి సభలో వీరి కుటుంబాలకు ఘనంగా సత్కరించి గౌరవం ఇవ్వాల్సిందిగా వారితో మాట్లాడి ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి కి తెలియజేసి సన్మానం జరిగే విధంగా చూస్తానని మాకు హామీ ఇవ్వడం జరిగింది. అదేవిధంగా జోగులాంబ గద్వాల జిల్లాలో 1969 ఉద్యమకారులు మలిదశ ఉద్యమకారులు తెలంగాణ కొరకు అసువులు బాసిన కుటుంబాన్ని కూడా పాల్గొని గద్వాలలో ఘనంగా తెలంగాణ ఆవర్భావ దినోత్సవాన్ని అసువులు బాసిన వారికి ఘన నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను సత్కరించే విధంగా జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి మన జిల్లాలో కూడా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని గనంగా జరుపుకోవాలని కోరుతూ గద్వాల జిల్లా ప్రజలందరూ తొలి దశ మలిదశ ఉద్యమకారులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఇట్టి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుందామని తెలియజేసినవారు ఇందులో పాల్గొన్న వారు జంగం చంద్రశేఖర్ , సుమలత, నర్సింహులు, వెండి నరసింహ, కృష్ణ, తిమ్మన్న, రాముడు, వెంకటేష్, రమేష్ గౌడ్, జక్కలి రవి సాదతుల్లా ఇంకా చాలా మంది పాల్గొన్నారు.



జెడ్పి చైర్మన్ ను కలిసిన 1969 ఉద్యమ కారులు మోహన్ రావు అచ్చన్న గౌడ్‌లు

## గుండెపోటుతో ప్రవేటు ఉపాధ్యాయుడు మృతి..

**- కౌకుంట్లలో విషాధం - శోకసంద్రంలో విద్యార్థులు**

**దేవరకద్ర,మే 29 ప్రభాతవార్త:** ఆయన ఒక ప్రవేటు ఆంగ్ల ఉపాధ్యాయుడు..కాని అందరి మన్నలను పొందాడు..విద్యనేర్పడంలో ఆయనకు ఆయనే సాటి...నిరుపేద విధ్యార్థులకు తన వంతు సహాయం చేసేవారు...కాని విధి ఆయనను చూసి ఓర్వలేకపోయింది... గుండు పోటు రూపంలో ఆయనను మృత్యువు పొట్టన పెట్టుకొంది.. కౌకుంట్లలో బుదవారం తెల్లవారుజామున ఈ విషాదకర సంఘటన చోటుచేసుకొంది.కౌకుంట్లలో గుండెపోటుతో నాగరాజు అనే ఓ ప్రవేటు ఉపాధ్యాయుడు మృతి చెందారు.చిన్నప్పటినుండి గ్రామంలో నాగరాజు కష్ఠపడి చదువుకొని అందరితో కలసిమెలసి ఉండే వారు.విద్య అంటే ఆయనకు ఎనలేని ప్రేమ.ఇంతవరకు దేవరకద్రలోని సివిరామన్,శ్రీవాణి శిశుమందిర్,వెంకటసాయి పాఠశాలలో ఆయన పనిచేశారు.ప్రస్తుత ం డోకూర్ తపోవన్ ప్రవేటు పాఠశాలలో ఆయన ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.ఎలాగైన ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాలన్న లక్ష్యంతో ఆయన కృషి చేస్తుండేవారు.కాని ఆ కోరిక తీరక ముందు ఆయన పరలోకానికి పయనమయ్యారు.వేసవి సెలవులు ఉన్నందున రెండురోజుల క్రితం హైద్రాబాద్‌లోని తన బందువుల వద్దకు వెళ్ళారు.అక్కడ అకస్మాత్తుగా ఆయనకు గుండె పోటు రావడంతో నాగరాజు మృతి చెందారు.దీంతో కౌకుంట్లలో విషాదం అలుముకొంది.జరిగిన సంఘటనను గ్రామస్థులు,సాటి పాఠశాల ఉపాధ్యాయులు,స్నేహితులు జరిగిన సంఘటనను జీర్ణించుకోలేక పోతున్నారు.కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.ఉపాధ్యాయుడు నాగరాజు వద్ద విద్యనేర్చుకొన్న విధ్యార్థులు శోకసంద్రంలో మునిగిపోయారు.వారి రోదనలు ఉపాధ్యాయుడు నాగరాజు ఇంటివద్ద మిన్నంటాయి.మృతుడు నాగరాజుకు భార్య,ముగ్గురుకూతుర్లు,కొడుకు ఉన్నారు. నాగరాజు పార్థీవదేహాన్ని బుదవారం సాయంత్రం కౌకుంట్లకు తీసుకవచ్చారు.గురువారం అంత్యక్రియలు జరుగనున్నాయి.



రోదిస్తున్న విద్యార్థులు (ఇన్‌సెట్లో) మృతుడు నాగరాజు(ఫైల్)

## వైభవంగా వెంకటగిరి స్వామి కళ్యాణం..

**కొత్తకోట మే 29 ప్రభాతవార్త :** కొత్తకోట పట్టణ సమీపంలో వెంకటగిరి క్షేత్రం నందు వెలిసిన శ్రీ భూలక్ష్మి వెంకటేశ్వర స్వామి కళ్యాణం వైభవంగా నిర్వహించడం జరిగింది. పూజలు అనంతరం అమ్మవారికి మంత్రోచ్చరణల మధ్య మేళ తాళాలతో స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది శోభయమానంగా అలంకరించి కళ్యాణ మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళ్యాణోత్సవంలో జిలకర బెల్లం తదితర పూజలు అమ్మవారికి మంగళసూత్రధారణ జరిపించారు. స్వామి వారి జన్మ నక్షత్రం శ్రావణ నక్షత్రం రోజున వెంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తి విగ్రహాలను ఆలయం అర్చకులు పట్టు వస్త్రాలతో అలంకరణ చేసి కళ్యాణ మండపంలో అర్చకుల పేద మంత్రాలతో కళ్యాణం వైభవంగా నిర్వహించారు. సింగరా ఆచార్యులు , కిట్టు స్వామి, అమిత్ స్వాములు స్వామివారి కళ్యాణాన్ని జరిపించారు. ఆలయ గర్భగుడి నుండి ఉత్సవ మూర్తి విగ్రహాలని కళ్యాణ మండపం వద్దకు తీసుకువచ్చి కళ్యాణం నిర్వహించిన తర్వాత పల్లకిలో కూర్చోబెట్టి పూజలు చేశారు. స్వామి వారి భక్తులు పల్లకి సేవతో గోవింద నామస్మరణల మధ్య భూజాలపై పల్లకిని మోస్తు ఆలయం చుట్టూ భక్తులు పెద్ద సంఖ్యలో ప్రదక్షణలు చేస్తూ సేవలు వైభవంగా నిర్వహించారు. కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు వివిధ గ్రామాల నుండి భక్తులు పాల్గొన్నారు. వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వేముల శ్రీనివాస్ రెడ్డి, బలిజేపల్లి శ్రీనివాసులు శెట్టి, సంద వెంకటేష్, హైదరాబాద్ వాస్తవాలు వేణుగోపాల్ , పాండురంగం తదితరులు పాల్గొన్నారు.



కళ్యాణంలో పాల్గొన్న భక్తులు

## మాజీ ఎంపీటీసీ రాంచంద్రయ్య మృతికి సంతాపం..!!

**భూత్పూర్,మే 29,ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం కొత్తమొల్గరకు చెందిన మాజీ ఎంపీటీసీ రాంచంద్రయ్య(55) బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు.విషయం తెల్సుకున్న భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ కొత్తమొల్గర గ్రామానికి చేరుకుని రాంచంద్రయ్య మృతదేహానికి నివాళులర్పించారు.రాంచంద్రయ్య కుటుంట సభ్యులకు తన వంతు సహాయంగా రు.ఐదు వేలు ఆర్థిక సహాయం అందించారు.చైర్మన్ వెంట బీఆర్ఎస్ నాయకులు సత్తూర్ నారాయణగౌడ్,తూము శ్రీనివాస్‌రెడ్డి,గడ్డం యాదయ్య,గడ్డం రాములు తదితరులు ఉన్నారు.

**పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడి సంతాపం :**

మాజీ ఎంపీటీసీ సభ్యుడు రాంచంద్రయ్య అకాలమృతి తీరనిలోటని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ అన్నారు.బుధవారం కొత్తమొల్గరలో రాంచంద్రయ్య మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు.నవీన్‌తో పాటు ఎమ్మెల్యే జీఎంఆర్ సోదరుడు భాస్కర్‌రెడ్డి కూడా హాజరై నివాళులర్పించారు.

**కమ్మరి అనురాధ కుటుంబానికి చైర్మన్ ఆర్థిక సహాయం :**మంగళవారం సాయంత్రం అనారోగ్యంతో మృతిచెందిన భూత్పూర్ పట్టణ కేంద్రానికి చెందిన కమ్మరి వెంకటయ్య భార్య కమ్మరి అనురాధ భౌతికకాయానికి పూలమాలలు వేసి మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ నివాళులర్పించారు. తన వంతు సహాయంగా మృతురాలి కుటుంబ సభ్యులకు ఐదువేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సత్తూర్ నారాయణగౌడ్,సత్తూర్ సురేష్‌గౌడ్,గడ్డం రాములు, పులగుర్ల మల్లేష్,సత్తూర్ తిరుపతయ్య గౌడ్,వి శ్రీశైలం,వడ్ల బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



పూలమాలలు వేసి నివాళ్ళులర్పిస్తున్న చైర్మన్ బస్వరాజ్‌గౌడ్



మాజీ ఎంపీటీసీ మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న మున్సిపల్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు నవీన్‌గౌడ్,భాస్కర్‌రెడ్డి తదితరులు

## మృతి చెందిన ఉపాధి హామీ కూలీకి ఎక్స్‌గ్రేషియా చెల్లింపు...

**వెల్దండ, మే 29 ప్రభాతవార్త:**మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామానికి చెందిన ఉపాధి హామీ పనులు చేస్తుండగా ఏప్రిల్ 10వ తేదీన అస్వస్థతకు గురై వెల్దండ మండలం బొల్లంపల్లి గ్రామానికి చెందిన కొమ్ము దశరథ అలియాస్ దసరయ్య మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి రూ.2లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించుటకు జిల్లా కలెక్టర్, ప్రొగ్రామ్ కోఆర్డినేటర్ ఆమోదించారని ఎపీఓ ఈశ్వర్‌జీ తెలిపారు. ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి రూ.2లక్షలు అందించనున్నట్లు ఎపీఓ ఈశ్వర్‌జీ పేర్కొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



**వెల్దండ, మే 29 ప్రభాతవార్త:**వెల్దండ మండలం కంటోనిపల్లి గ్రామానికి చెందిన కేశమోని మల్లేష్‌గౌడ్ ఇటీవల మృతి చెందారు. మృతుడి కుటుంబాన్ని కంటోనిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ పెద్ది రామకృష్ణ పరామర్శించి తన వ్యక్తిగతంగా రూ.5వేల ఆర్థిక సహాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సురేందర్, జంగయ్య, తోట సుదర్శన్, ఆంజనేయులు, అంజితో పాటు తదితరులు ఉన్నారు.

## మోడల్ స్కూల్స్‌లో ఇంటర్ ప్రవేశాలకు ధరఖాస్తుల ఆహ్వానం...

**వెల్దండ, మే 29 ప్రభాతవార్త:**మండల కేంద్రంలోని ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానించనున్నట్లు ప్రిన్సిపాల్ పుష్పలత తెలిపారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసక్తి గల విద్యార్థులు ఇంటర్మీడియట్ ప్రవేశాలకు ఈ నెల31 చివరి గడువు అని తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో ప్రవేశాలకు ధరఖాస్తు చేసుకోవాలన్నారు. మోడల్ స్కూల్‌లో విజ్ఞానవంతులైన అధ్యాపకులచే బోధన గావిస్తున్నారని, మంచి విద్య అందు తుందని, విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## దాతల విరాళం



**పెబ్బేరు మే 29 ప్రభాతవార్త :**పెబ్బేరు మున్సిపల్ పట్టణ కేంద్రంలోని టీ.వీ.ఎస్ షోరూం సమీపంలో ఉన్న సుంకలమ్మ గుడి చుట్టూ ప్రహరీ గోడ, సిసి బెడ్ నిర్మాణాల కోసం బుధవారం నిర్వాహకులకు దాతలు విరాళం అందజేశారు. సుబ్బయ్య గుప్త రూ.5వేలు, రాంపూరం బలిజ నాగరాజు రూ.5వేలు, గోవర్ధన చారి రూ.5వేలు, ఎయిర్టెల్ మమేష్ యాదవ్ రూ.5వేలు విరాళం అందజేశారు.ప్రహరీ గోడ నిర్మాణం కోసం దాతలు సహాయ సహాకారాలు అందజేయాలని నిర్వాహకులు ఆర్టిస్ట్ పున్న వేణు, సత్యానారాయణ రెడ్డి కోరారు.

## యువకుడికి అభినందనలు వెల్లువ



**కొత్తకోట మే 29 ప్రభాతవార్త :** కొత్తకోట స్థానిక ఎస్సీ కాలనికి చెందిన చంద్రబాబు భారతీ దంపతుల కుమారుడు ఎస్.అనిల్ ఇంటర్మీడియట్ (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హైదరాబాద్) గురుకులంలో సీటు సాధించినందుకు చంద్రబాబు మిత్ర బృందం,మిత్రులు కలిసి ఇంటికి వెళ్లి వారి కుమారుడిని శాలువతో సన్మానించి , అభినందించారు.ఈ సంర్భంగా వారు మాట్లాడుతూ మా మిత్రుడు ఆటో నడుపుతూ పిల్లల్ని మంచిగా చదివించాడని అభినందిస్తూ పదవ తరగతి లో 8.5 ఎ గ్రేడ్ లో మంచి మార్కులతో పాస్ అయ్యాడని గురుకుల ప్రవేశ పరీక్ష రాసి హైదరాబాద్ గురుకుల కాలేజీలో ఇంటర్ బైపిసిలో సీటు సాధించాడని హర్షం వ్యక్తం చేస్తూ అచల్ మరింత ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో చంద్రబాబు మిత్రులు సతీష్ రాజు, కర్ణ కుమార్ , సిమీ యాసోన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్వోసి కాపీ అందజేత

**అలంపూర్ మే 29 ప్రభాతవార్త:**అయిజ మున్సిపాలిటీ పరిధిలోని ఎక్లాస్ పురం గ్రామానికి చెందిన నర సింహులు అనారోగ్యంతో బాధ పడుతున్నారు. విషయాన్ని ఎమ్మెల్యే విజేయుడు దృష్టికి తీసుకురాగా అపరేషన్ నిమిత్తం రూ.4లక్షల ఎల్వోసి మంజూరు చేయించారు. బుధవారం ఎమ్మెల్యే విజే యుడు బాధితునికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వర్ రెడ్డి, నీలప్ప, పరమేష్ గౌడ్, రాజేందర్, సురేష్, పరుశ రాముడు తదితరులు పాల్గొన్నారు.



# పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

■వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**వనపర్తి ప్రతినిధి మే 29 ప్రభాతవార్త:** పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం ఐడిఓసి లోని కాన్ఫరెన్స్ హాల్లో పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 3 నుండి ప్రాంభమయ్యే అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద పోలీస్ భద్రత, బందోబస్తు ఏర్పాట్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ తదితర ఏర్పాట్లు పక్కగా ఉండాలన్నారు. పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు 964 మంది విద్యార్థులు హాజరు కేవలం వన్ సమాయానికి కానున్నందున వనపర్తిలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్టీసి బస్సులు సమయానికి నడపాలని సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద మౌలిక వసతులతో పాటు ప్రథమ చికిత్స కిట్ల తో ఏఎన్.యం , ఆశా వర్కర్లను నియమించాలని వైద్య అధికారిని ఆదేశించారు. పరీక్షలు జరుగనున్న ప్రాంతంలో 144 సెక్షన్ అమలు చేయాలని జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచె విధంగా చూడాలన్నారు. పరీక్షా సి.సిటి.వి కెమెరాలు ఉండేవిధంగా చూడాలని తెలిపారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ యం.నగేష్, ఇతర శాఖల అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.



ఉన్నత విద్యాశాఖ అధికారాలతో సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

# జోగులాంబ జిల్లాను మత్తు రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

◆గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

**గద్వాల ప్రతినిధి మే 29 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లాను గంజాయి, మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ముసిని వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఐడిఓసి లోని తన ఛాంబర్‌లో మాదక ద్రవ్యాల నిర్మూలనకు నార్కోటెక్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో సంబంధిత అధికారులతో మాట్లాడారు. జిల్లాలో నిషేధించబడిన మత్తు పదార్థాల సరఫరా లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకో వాలన్నారు. పాఠశాలలు, కళాశాలల వద్ద డ్రగ్స్ ను విక్రయించకుండా అధికారులు పూర్తి నిఘా పెట్టాలన్నారు. జిల్లాలో గంజాయి సాగు జరుగకుండా అధికారులు సమన్వయంతో పర్యవేక్షించాలని తెలిపారు. మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే నష్టాలపై జూన్ చివరి వారంలో ప్రతి మండలంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో మత్తు పదార్థాలను ప్రజలు వినియోగించకుండా, యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లుగా వివరించారు. ఈ సమావేశంలో ఆర్.డి.ఓ రామ్ చందర్, డి.ఎస్.పి సత్య నారాయణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ్ కుమార్, డీ డబ్ల్యూ ఓ సుధారాణి, ఎఫ్.ఆర్.ఓ దేవరాజు, డి.సి.పి.ఓ నరసింహ, తదితతరులు పాల్గొన్నారు.

## వైభవంగా ఈదమ్మ, కోటమైసమ్మ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

**మిడ్జిల్, మే 29,ప్రభాతవార్త:** మిడ్జిల్ మండల కేంద్రంలోని ఈదమ్మ,కోట మైసమ్మ బొడ్రాయి ప్రతిష్ఠాపన చేసి ఐదేండ్లు పూర్తయిన సందర్భంగా ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా గ్రామ దేవతల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తూ వచ్చారు. గ్రామస్తులు పట్టణాల నుంచి గ్రామాలకు చేరకోవడం కళకళలాడతున్నది. ఉత్సవాలకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బాలాత్రిపుర సుందరి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లక్ష్మీకాంత్‌రెడ్డి,ఈదమ్మ తల్లి మాందాత దర్శనం చేసుకొని ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రదాన కార్యదర్శి ఎన్ రాజేశ్వర్,సింగిల్ విండోచైర్మన్ కూచురు శ్రీనివాస్‌రెడ్డి,యువమోర్చా జిల్లా అధ్యక్షుడుతిరుపతి,మండల ప్రధాన కార్యదర్శి వాసుదేవ్, ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి నాయకులుఅంజనేయులు,దేవేందర్, బాలరాజ్‌గౌడ్, రామకృష్ణ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబ సభ్యులకు మాజీ మంత్రి పరామర్శ





బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, చైర్‌పర్సన్ దోరెపల్లి లక్ష్మీ

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 29, ప్రభాతవార్త:** నీటమునిగి ప్రమాదవశాత్తు మరణించిన చిన్నారుల తల్లిదండ్రులను మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పరామర్శించారు. జడ్చర్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు మతిన్, అజ్మత్ కుమారులు బిజినేపల్లిలో మంగళవారం నీటమునిగి మరణించారు. బుధవారం విషయం తెలుసుకున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం చెప్పారు. ఘటనా వివరాలు అడిగి తెలుసు కున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ఓదార్చారు. ఆయనవెంట మున్సిపల్ చైర్‌పర్సన్ దోరెపల్లి లక్ష్మీరవీందర్, జీసీసీ మాజీ చైర్మన్ వాల్యానాయక్, కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

## శారీ ఫంక్షన్‌కు హాజరైన పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు



**భూత్పూర్,మే 29,ప్రభాతవార్త:** బుధవారం పట్టణ కేంద్రంలోని కెఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన భూత్పూర్ పట్టణానికి చెందినశంకరోళ్ల రాజు కూతురు శారీ ఫంక్షన్‌కు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బోరింగ్ నర్సింహులు, బజార్ పరుశురాం, సాయియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలతో మోసపోవద్దు



రైతులకు అవగాహన కల్పిస్తున్న నాగార్జునరెడ్డి

**లింగాల, మే 29, ప్రభాతవార్త:** రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవొద్దని మండల వ్యవసాయ అధికారి నారార్జునరెడ్డి అన్నారు. బుధవారం లింగాల మండల పరిధిలోని అప్పాయిపల్లి, శ్రీరంగాపూర్ గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి నాగార్జున రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం గుర్తించిన ఎరువులు,విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు లైసెన్స్ పొందిన డీలర్ల వద్దనే నాణ్యమైన విత్తనాలు,ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. గ్రామాల్లో తిరిగి విత్తనాలువిక్రయించే వారి వద్ద విత్తనాలు కొనుగోలు చేయవద్దని అలాంటివారు కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో మానస, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, శకుంతల పాల్గొన్నారు.

# ఒకే వర్గానికి జయంతులు, వర్ధంతులు చేయడం విడ్డూరం

◆అఖిలపక్ష ఐక్యవేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్

**వనపర్తి ప్రతినిధి మే 29 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాల జరుగుతున్న రాజకీయాలపై అచలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్ మాటాడుతూ మాజీ ఎమ్మెల్యేలు,మాజీ మంత్రులు ఒకే వర్గానికి జయంతులు ,వర్ధంతులు చేయడం విడ్డూరం మరి కీర్తిశేషులు ఎమ్మెల్యేలు అయ్యప్పకి, బాలకృష్ణయ్యకి, జయరాములు ఎందుకు చేయడం లేదు అఖిల పక్ష ఐక్యవేదిక స్వయాన ఆహ్వానం పంపినా ఎందుకు రావడం లేదు. వారు బీసీలు అనే చులకన చేస్తూ జయరాములు వర్ధంతి రోజు జరిగిన బీసీ సదస్సు విజయవంతం కావడంతో జీర్ణించుకోలేకపోతున్న ఇద్దరు మాజీలు నిన్న జరిగిన సూరవరం ప్రతాపరెడ్డికి నివాళులు అర్పించిన తర్వాత ఒకరు మాజీ ఎమ్మెల్యే కీర్తిశేషులు జయరాములు వర్ధంతి చేసుకోవడం అనవసరమని ఒక వర్గానికి కొమ్ముకాస్తున్నట్లు ఉందని అనడం చాలా విడ్డూరం ఇంకొకరు తమ అధ్యక్షుడు నివాళి అర్పించాలని తెలిసి, ఎందుకు వెళ్లావు ఎవరు వేయమన్నారు దండలు అని చేడా మడ తిట్టాడని తెలిసి ఖండిస్తున్నాము అయితే ఐక్యవేదిక తరపున అందరి జయంతులు వర్ధంతిలు చేస్తాం మేము వనపర్తి ఎమ్మెల్యేలను అందరిని గుర్తించబడతాము, కీర్తిస్తాము మాకు వర్గాలు బేధాలు లేవు కానీ మాజీ ఎమ్మెల్యేలను కనీసం గుర్తుంచుకోలేని మీరు చరిత్రహీనులయ్యారు. నిన్న మొన్న సురవరం ప్రతాపరెడ్డి విగ్రహం మాత్రమే పెట్టి ఆయనకు ఒక్కరికి మాత్రమే దండలు వేయడం ఏమిటి ఆయనతో పాటు మిగతా కీర్తిశేషులు అయిన ఎమ్మెల్యేల విగ్రహాలు పెట్టి వారికి కూడా నివాళులు అర్పించడం మీ బాధ్యత కాదా..? మీరు గుర్తించని ఎమ్మెల్యే బాధ్యత మేము తీసుకుని వారి విగ్రహాలు పెట్టాలని వారికి నివాళులర్పించాలని కొరితే అది తప్పా? నీతి నిజాయితిపరులైన అయ్యప్ప, జయరాములు,డాక్టర్ బాలకృష్ణయ్య వారు వనపర్తికి ఎంతో సేవ చేశారు. వారి విగ్రహాలు పెట్టాలని గత నాలుగు సంవత్సరాలుగా మేము పోరాడుతుంటే పార్టీలు అంటగట్టి వారిని అవమానించారు. వారిలో డాక్టర్ బాలకిష్ణయ్య విగ్రహం ఒక్కరిదే పెట్టి మీ కుహనా బుద్ధిని ప్రదర్శించుకున్నారు. జయ రాములు పేరు మీద ఉన్న గెస్ట్ హౌస్ తీసివేసి మీ యొక్క అహంకారాన్ని నిరూపించుకున్నారు. పేద ఎమ్మెల్యే, నిజాయితీగల ఎమ్మెల్యే, తాను తప్ప తన వారిని ఎవరిని రాజకీయంలోకి రాకుండా నిజాయితి ప్రదర్శించుకున్న జయరాములు వర్ధంతి చేసుకోవడమే తప్పా? మీరు గుర్తించని, చేయలేని పనిని మేము ఇలా అక్కసు వెలబుచ్చుతారా?లేక బీసీలు ఏకమవుతున్నారని భయపడుతున్నారా? వనపర్తికి సేవ చేస్తే మంచిదే కానీ వనపర్తి నాశనం లేపితే మంచిది కాదు కదా? ప్రజలమే పిచ్చోళ్ళు కారు అన్ని చూస్తున్నారు అన్నిటికి వాత పెడుతున్నారు ఇంకా పట్టించుకోవాలనుకుంటే ఇలాంటి కానీ పనులు చేయండి బీసీలను వాడుకుని వారిపై పెత్తనం చేస్తున్నారా చేయండి కానీ, కించపరిస్తే మాత్రం ఊరుకునేది లేదు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్యేలు అంతా మీరే ఉన్నారు కనుక స్థానిక సంస్థలు ఎన్నికలకు ముందే కుల గణన చేసిదామాషా ప్రకారం సీట్లు కేటాయించాలని, ఉమ్మడి జిల్లాలోని ఐదు జడ్పీచైర్మన్లు ఇతర జెడ్పిటీసీలు ఎంపీపీలు ఎక్కువ శాతం బీసీల కేటాయించాలని,అలాగే ఎస్సీ,ఎస్టీలకు అగ్రవర్ణాలలో కోమటి, రెడ్డి బ్రహ్మణ,కులస్తులకు కూడా వారి దామాషా ప్రకారం సీట్లు కేటాయిం చాలని కోరుతున్నాము.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సతీష్ యాదవ్

# సర్జికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

**ఉప్పునుంతల మే 29 ప్రభాతవార్త:** అచ్చంపేట పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో జూన్ 5,6 వ తేదిలలో నిర్వహించే మెగా సర్జికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని వెల్టూరు గ్రామ మాజీ సర్పంచు గున్నమోని లింగమయ్య యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బుసిరాజు మల్లయ్య తెలిపారు. బుధవారం మండల పరిధిలోని వెల్టూరు గ్రామంలో సర్జికల్ క్యాంపు సంబంధించిన గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు డా.చిక్కుడు వంశీకృష్ణ, అమ్రాబాద్ జడ్పిటిసి డా.చిక్కుడు అనురాధ ఆధ్వర్యంలో సర్జికల్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. నియోజకవర్గంలో ఉన్న పలు గ్రామాల, మండలాల ప్రజలు పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనివారు కోరారు. క్యాంపుకు వచ్చిన వారికి పలు రకాల టెస్టులు నిర్వహించి, అవసరం ఉన్నవారికి అపరేషన్ కూడా చేస్తారని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వారి తో పాటు గుద్దటి బాలరాజు, కసిరెడ్డి కళావతమ్మ, గజ్జె సైదులుగౌడ్, వంగవెంకట్‌రెడ్డి, నిలిపాషా, భాస్కర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, లాలుగౌడ్, గౌస్, నిరంజన్,బాలరాజు, బాలస్వామి, ఇబ్రహీం పాషా ఉన్నారు.



వెల్టూరులో సర్జికల్ క్యాంపు పోస్టర్ విడుదల

# ఘనంగా సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవం

**వనపర్తి ప్రతినిధి మే 29 ప్రభాతవార్త:** సిఐటియు కార్యాలయంలో 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కే సునీత అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిఐటియు వనపర్తి జిల్లా కార్యదర్శి సిఐటియు పుట్ట ఆంజనే యులు జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం జరిగిన సభలో పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ 1970 మే 30న పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కలకత్తా నగరంలో ఐక్యత-పోరాటం అనే నినాదంతో సిఐటియు ఆవిర్భవించిందని తెలిపారు స్వాతంత్ర పోరాట వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని సిఐటియు పనిచేస్తుందని చారిత్రక అవసరాన్ని బట్టి ఐక్య పోరాటాలు రథసారథిగా సిఐటియు ఆవిర్భవించిం దని అన్నారు. అనేక ఐక్య పోరాటాలు నిర్వమంచి ందని, సరళీకరణ ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విదానాలు 1991లో పీవీ నరసింహారావు ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు వచ్చాయని, విధానాలను తీవ్రంగా మొదటి నుంచి వ్యతిరేకించిన సంఘం సిఐటియు అని మిగతా సంఘాలు కలిసి రాకపోయినా నాటి నుండి 1991 నుండి నేటి వరకు 22 జాతీయ సమ్మెలు నిర్వహించిందని, కార్మిక వర్గ హక్కుల సాధన కోసం ఐక్య పోరాటాలకు నాయకత్వం వహిస్తుందని తెలిపారు. నేడు దేశంలో ఉన్న 11 కేంద్ర ట్రేడ్ యూనియన్‌లను ఐక్యం చేసిందని అనేక సమ్మెలో కలిసి పోరాడిందని తెలిపారు. నేడు బిజెపి అధికారంలోకి వచ్చాక ప్రైవేటీకరణ విధానాలు వేగం పుంజుకున్నాయని, ప్రభుత్వ రంగ సంస్థలను నేషనల్ మానిటైజేషన్ పైపులైను పేరుతో ఆరు లక్షల కోట్ల రూపాయలకు కారు చౌకగా మోడీ అనుయాయులకు అప్పగిస్తుందని విమర్శించారు .నిరుద్యోగం పెరిగింది ,దారిద్రం పెరిగిందని ,10శాతం చదువుకున్న నిరోద్యోగులు ఉన్నారని ,నూట నలభై ఐదు దేశాల్లో ఆకలి సూచిలో 111వ దేశంగా భారతదేశం ఉందని అన్నారు .కార్పొరేటు మాఫీ చేశారని , బ్యాంకులకు కార్పొరుట్లకు 15 లక్షల కోట్లు మాఫీ చేశారని ,పేదలను జీఎస్టీ పేరు మీద ఇతర పన్నుల పేరుతో పరోక్ష పనులు ఎక్కువగా వసూలు చేసి ధనవంతులకు దోచిపెడుతున్నారని విమర్శించారు .నరేంద్ర మోడీ నేను అధికారంలోకి వస్తే అవినీతి డబ్బు తెచ్చి 15 లక్షల రూపాయలు ఒక్కొక్కరి అకౌంట్లో వేస్తానని జన్ ధన్ అకౌంట్లో ఓపెన్ చేయించారని 15 రూపాయలు కూడా వేయలేదని అన్నారు .నేడ సెక్యులర్ రాజ్యాంగం గా ఉన్న లౌకిక రాజ్యాంగంలో ఈ భారత దేశంలో మతోన్మాదాన్ని పెంచి మతాన్ని ఓట్లకు ఉపయోడించుకున్న నరేంద్ర మోడీ విధానాలను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకొని మెలగాలని అన్నారు .సిఐటియు కార్మిక వర్గాన్ని ఒక వర్గంగా ఐక్యం చేసేందుకు పనిచేస్తుందని అనుబంధాలతో నిమిత్తం లేకుండా ఐక్య ఉద్యమాలను పెంపొందిస్తుందని అన్నారు .నేడు ఉన్న పెట్టుబడిదారీ ,భూస్వామ్య వ్యవస్థను రద్దుచేసి కార్మిక వర్గ రాజ్య స్థాపన కోసం సిఐటియు పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు నారాయణమ్మ ,నందిమల్లరాములు , బి.కవిత ,లింగం శెట్టి ,సాయిబాబు ,బుచ్చమ్మ ,గిరిజ గంధం మదన్ ,మద్దిలేటి, ఆశా వర్కర్లు ,అంగన్వాడి టీజర్లు భవన నిర్మాణ కార్మికులు , హాస్పిటల్ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.




# బీసీ కులగణన చేపట్టాలి

- కులగణణ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి
- బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణాయాదవ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే29,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే బీసీ కులాల గణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించి స్థానిక సంస్థలు నిర్వహించాలని బీసీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్ ఆధ్వర్యంలో డీఆర్వో రవికుమార్‌కు వినతి అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి నియోజకవర్గంలో జరిగిన సభలో అధికారంలోకి వచ్చిన ఆరు నెలలలోపు బీసీ కులాల గణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించి ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించిదని గుర్తు చేశారు. ఆరు నెలలు పూర్తయినా హామీని విస్మరించి కులగణన చేపట్టకుండా కాలయాపన చేస్తుందని తెలిపారు. సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల గ్రామాల్లో అభివృద్ధి కుటుంపడుతుందని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టి స్థానికల సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. లేనియెడల బీసీ సెల్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సేన నాయకులు గొడుగు నర్సింహులు, వెంకటేశ్, శివశంకర్, కావలి రాములు, శేఖర్ పాల్గొన్నారు.

## నూతన గృహప్రవేశానికి హాజరైన రాష్ట్ర ప్రణాళిక ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి



**వనపర్తి ప్రతినిధి మే29 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం కేతేపల్లి గ్రామానికి సంబంధించిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు స్వర్ణ రామేశ్వర్‌రెడ్డి ఆహ్వానం మేరకు నూతన గృహప్రవేశానికి హాజరైన రాష్ట్రప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ డా. జిల్లెల చిన్నారెడ్డి ఈ కార్యక్ర మంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ నాయకులు సత్యరెడ్డి పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ అద్యక్షుడు పెంటన్న యాదవ్, తదితర కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ



**అడ్డాకుల మండలం మే 29 ప్రభాతవార్త:** మండల కేంద్రానికి చెందిన అడ్డాకుల మండల కోఆప్షన్ ఖాజాగోరి తండ్రి బషీర్ గోరి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. తుది శ్వాస విడిచారు. స్థానిక నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న మండల జడ్పిటిసి నల్లమద్ది రాజశేఖర్ రెడ్డి వారి మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. మృతుని స్వగృహనికి వెళ్లి ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, మనోధైర్యం కల్పించారు. వీరితో పాటుగా అడ్డాకుల మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు టి.శ్రీనివాస్ రెడ్డి, జడ్పి మాజజీ కో ఆప్షన్ పొన్నకల్ మహిముద్, దేవేందర్ రెడ్డి, బొడ్డు రమేశ్, శ్రీనివాస్ యాదవ్, భీమ్‌రెడ్డి, శ్రీనివాసులు,మహేశ్‌యాదవ్, చక్రపాణిరెడ్డి, ఖలీఫాపాష, మనోహర్, విష్ణువర్దన్‌రెడ్డి, మైనార్టీ సోదరులు, యువకులు పాల్గొన్నారు.

## సీడ్స్‌లో పనిచేసే వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన ఎండి ఫారూక్

**భూత్పూర్,మే 29,ప్రభాతవార్త:** భూత్పూర్‌లోని ఓ సీడ్స్ కంపెనీలో పనిచేసే వ్యక్తి అదృశ్యమైన ఘటన బుధవారం చోటుచేసుకుంది.పోలీస్ ఎస్సై శ్రీనివాసులు కథనం ప్రకారం జిల్లా కేంద్రంలోని న్యూప్రేమ్ నగర్‌కు చెందిన ఎండి ఫారూక్(46) భూత్పూర్‌లోని విజయశ్రీ ఆగ్రోటెక్ సీడ్స్ కంపెనీలో పనిచేస్తుండేవాడు. మంగళవారం తేది 28న ఎప్పటి లాగే సీడ్స్ షాప్‌కు వెళ్తున్నానని చెప్పి ఇంటినుంచి బయలుదేరి సాయం త్రం వరకు ఇంటికి తిరిగిరాలేదని, సాయంత్రం తాము షాపు వద్దకు వెళ్లి చూడగా,షాపు మూసుకుని ఉందని,తమకు తెలిసిన వారి వద్దకు వెళ్లి వెతకగా ఆయన ఆచూకి తెల్వలేదని అదృశ్యమైన వ్యక్తి సోదరుడు ఎండి ఇలియాస్ భూత్పూర్ పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొ న్నాడు.ఇలియాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్స్ రద్దు చేస్తాం



ఎరువుల దుకాణంలో తనిఖీ నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

**అమరచింత మే 29 ప్రభాతవార్త:** వర్షాకాలం సీజన్‌లో విత్తనాలు అమ్మితే లైసెన్స్‌లు రద్దు చేస్తామని ఏడిఏ దామోదర్ ఫర్టిలైజర్ షాప్ యజమానులను హెచ్చరించారు అమరచింత మండలం పరిధిలో బుధవారం నాగర్‌కడుమూర్ అమరచింత ఫర్టిలైజర్ దుకాణాలను ఆకస్మిక తనికి నిర్వహించారు. ఎరువుల దుకాణంలో రికార్డులను ఎరువుల నిల్వల, బిల్లు రసీదులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరచింత పట్టణంలో సాయి సావిత్రి ట్రేడర్స్‌లో ప్రిన్సిపాల్ సర్టిఫికేట్ సరిగ్గా లేనందువల్ల షాపులో ఉన్న లక్ష 300 680 నిలువ ఉన్న పత్తి విత్తనాలను అమ్మకాలను నిలిపి వేశామని అలాగే హనుమాన్ ట్రేడర్స్‌లో రసీదులు లేనందువల్ల 39 వేల మిరప పత్తి విత్తనాలను షాపు యజమానులు అమ్మకుండా నిలుపుదల చేశామని ఆయన తెలిపారు. రైతులు ఎలాంటి రసీదులు లేకుండా ఎరువుల దుకాణంలో విత్తనాలు కొనుగోలు చేయరాదని లైసెన్స్ కలిగిన షాపులో మాత్రమే విత్తనాలు కోనుగోలు చేయాలని ఆయన రైతులను కోరారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన తక్షణమే రసీదులు పొంది పంట వచ్చేవరకు రసీదులు భద్రంగాఉంచుకోవాలని ఆయన రైతులను కోరారు .గ్రామాలలో రైతులను మోసగించడానికి నకిలి విత్తనాలు విక్రయించడానికి వస్తే వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆయా గ్రామాల రైతులను కోరారు. అలాగే రైతులు ఎరువుల దుకాణంలో లూజుఉన్న సంచులలో కొనుగోలు చేయకుండా లేబుల్ ఉన్న ఎరువులను కొనుగోలు చేయాలని ఆయన రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో అమరచింత మండల ఏఓ, వినయ్ కుమార్, రాజేష్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## నివాళులర్పించిన ఎమ్మెల్యేలు

**ఇటిక్యాల, మే 29,ప్రభాతవార్తః** మండల పరిధిలోని వల్లూరు గ్రామానికి చెందిన లక్ష్మీదేవమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు గ్రామానికి చేరుకొని ఆమె పార్థీవదేహానికి నివాళులర్పించారు.బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా మండల పరిధి లోని కోదండపురం నర్సింహులు గుండెపోటుతో మృతిచెందగా ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. అదేగ్రామంలో వెంకటేశ్ అనారోగ్యంతో మృతిచెందగా ఆయన భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. అదేవిధంగా వల్లూరు గ్రామానికి చెందిన లక్ష్మీదేవమ్మ పార్థీవదేహానికి మాజీఎమ్మెల్యే అబ్రహం నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట రాంరెడ్డి, గిడ్డారెడ్డి, రవిప్రకాశ్, ధర్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మత్స్యశాఖ జిల్లా అధ్యక్షుడు గోపాల్, నాయకులు నాగేశ్, యుగంధర్‌రెడ్డి, సుంకన్న ఉన్నారు.

## ఫర్టిలైజర్ దుకాణం ఆకస్మిక తనిఖీ

**బిజినేపల్లి, మే 29,ప్రభాతవార్త:** మండల కేంద్రంతోపాటు వడ్డెమాన్, శాయిన్‌పల్లి గ్రామాల్లో బుధవారం వ్యవసాయ అధికారులు ఫర్టిలైజర్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఏడీఏ రమేశ్‌బాబు,ఏవో నీతిరెడ్డి ఆధ్వర్యంలో శ్రీసాయి ట్రేడర్స్, సాయి తిరుమల, శ్రీగౌతమ్ ట్రేడర్స్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం దుకాణాల్లో పత్తి, కంది, జనుము విత్తనాలు శాంపిళ్లు సేకరించి మలక్‌పేట, జడ్చర్లలోని విత్తన తనిఖీ కేంద్రాలకు పంపించినట్లు తెలిపారు. ఏడీఏ రమేశ్‌బాబు ముఖ్యంగా పత్తి విత్తనాల అమ్మకాల్లో పాటించాల్సిన నియమ నిబంధనలు వివరించారు. నకిలీ విత్తనాలు అమ్మకాలు చేయకుండా డీలర్లను హెచ్చరించారు. విత్తన డీలర్లు అందరూ రైతులకు విత్తనాలు అందించేటప్పుడు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని తెలిపారు. ఎమ్మార్పీ ధరలకు మాత్రమే విత్తనాలు విక్రయించాలని, విత్తనాల పూర్తి వివరాలు సేల్స్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అమ్మకాల్లో అవకతవకలు ఏమైనా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వారివెంట ఫరీద్‌పాషా, మధు ఉన్నారు.

